## క్లుప్తంగా

### 'ఏఎన్ఎంలకు ఇతర విధులు కేటాయించొద్దు'



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైద్య సిబ్బంది

**పుట్టపర్తి:** గ్రామాల్లో అనునిత్యం వైద్య సేవలు అందిస్తున్న తమకు ఇతర అదనపు విధులు అప్పగించొద్దని గ్రామ సచివాలయాల ఏఎన్ఎలు, ఎంఎల్‌హెచ్‌పీలు కోరారు. శనివారం బుక్కపట్నం ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. ఈ మధ్య తరచూ ఏదో ఒక సర్వే పేరుతో తమతో ఇతర పనులు చేయిస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా పింఛన్ల పంపిణీకి వినియోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వైద్య సేవలు అందించడంలో అంతరాయం కలుగుతోందన్నారు. ఇతర పనులు ఇవ్వకుండా కేవలం వైద్య సేవలకు మాత్రమే వినియోగించుకునేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

### కరువు భత్యం, మధ్యంతర భృతి ప్రకటించరా?



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

**కదిరి అర్బన్:** ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏలు, 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలన్నారు. అలాగే గత ప్రభుత్వ నియమించిన 12వ పీఆర్‌సీ కమిషన్ రాజీనామా చేసినందున వెంటనే పీఆర్‌సీ కమిషన్ నియమించాలన్నారు. నివేదిక సత్వరం తెప్పించుని పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. పెరిగిన ధరల సూచీకి అనుగుణంగా డీఏలు, పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరమహేశ్వర్, అశోక్ కుమార్, రామచంద్రారెడ్డి, షాజహాన్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఆరాధన



అలంకరణలో తిక్కస్వామి చిత్రపటం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని తిక్కస్వామి నగర్‌లో ఉన్న లక్ష్మయ్య స్వామి (తిక్కస్వామి) ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ఆరాధన చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్నదానం చేశారు.

### సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న డీపీటీఓ మధుసూదన్

**పుట్టపర్తి టౌన్:** ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. ప్రయాణికులను సకాలంలో గమ్యస్థానాలకు చేర్చి, మన్ననలు పొందాలని జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్ సూచించారు. శనివారం పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఇనాయతుల్లా అధ్యక్షతన సమయపాలన మసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీటీఓ మాట్లాడుతూ.. ఆర్టీసీలో సమయపాలన అత్యంత కీలకమైన అంశమన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తేనే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులపై మొగ్గు చూపుతారని తెలిపారు. కండక్టర్లు, డ్రైవర్లు నిర్ణీత సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. అలాగే గ్యారేజ్ సిబ్బంది బస్సులను సకాలంలో మరమ్మతులు చేసి ఇవ్వాలన్నారు. సమష్టి కృషితో ఆర్టీసీ ఆదాయం పెంపు సాధ్యం అవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల్లో నెల రోజుల పాటు సమయపాలన మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

### భక్తిశ్రద్ధలతో సత్యసాయి వ్రతం



వ్రతం ఆచరిస్తున్న భక్తులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్‌లో ఉన్న సుబ్బదాసు భజన మందిరంలో శనివారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక సత్యసాయి వ్రతం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేచారు.

# బడిలో చౌకదుకాణం!

- బరితెగించిన టీడీపీ నాయకుడు
- 5 నెలలుగా అందులోనే రేషన్ పంపిణీ
- ఇబ్బందులు పడుతూ నిత్యావసరాలు తెచ్చుకున్న వృద్ధులు, స్థానికులు
- ఎట్టకేలకు నోటీసులు ఇచ్చిన అధికారులు




టీడీపీ నాయకుడు ఆక్రమించిన పాఠశాల భవనం ఇదే..

**పుట్టపర్తి అర్బన్:** చౌక దుకాణం ఏర్పాటుకు అద్దె భవనం ఎందుకు అనుకున్నారో ఏమో టీడీపీ నాయకులు ఏకంగా పాఠశాల భవనాన్ని రేషన్ పంపిణీకి వినియోగిస్తున్నారు. 5 నెలలుగా అందులోనే చౌక దుకాణం నడుపుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం సచివాలయ సిబ్బంది నోటీసులు అందజేశారు. వివరాలు.. పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లి పంచాయతీ సాతార్లపల్లిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకుడు ఉత్తంరెడ్డికి చౌక దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి వచ్చింది. ప్రైవేటుగా గది అద్దెకు తీసుకుంటే ప్రతి నెలా అద్దె చెల్లించాలని భావించిన ఉత్తంరెడ్డి.. ఏకంగా పాఠశాల భవనంలోనే చౌక దుకాణం ఏర్పాటు చేశాడు. సదరు పాఠశాల భవనం ఊరికి దూరంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతూ సరుకులు తెచ్చుకున్నారు.

**రూ.లక్షన్నర ఖర్చు చేసి మరమ్మతులు**

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సుమారు 8 ఏళ్ల క్రితం సాతర్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మూసేశారు. అప్పటి ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డికి ప్రజలు ఎంత మొరపెట్టుకున్నా కనికరించలేదు. పాఠశాలను శాశ్వతంగా మూసేశారు. గ్రామంలో సుమారు 25 మంది ఇతర ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ఈ విషయాన్ని చెప్పడంతో పాఠశాలను తిరిగి ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి సర్వే చేయించారు. పిల్లలు వస్తారని భావించి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి రూ.1.5 లక్షల సొంత నిధులు ఖర్చు చేసి పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నాయకుడు భవనాన్ని ఆక్రమించి చౌక దుకాణం ఏర్పాటు చేశాడు.



ఉత్తంరెడ్డికి నోటీసులు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

### ఫిర్యాదుతో అధికారుల్లో చలనం

గ్రామస్తులు ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు స్పందించారు. సెక్రెటరీ ఓం ప్రసాద్, మహిళా పోలీస్ గంగ తదితరులు గ్రామానికి వెళ్లి సదరు చౌక దుకాణం డీలర్ ఉత్తంరెడ్డికి నోటీసులు అందజేశారు. వెంటనే పాఠశాలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఖాళీ చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు రోజుల్లో ఖాళీ చేసి తాళాలు అందజేస్తానని డీలర్ హామీ ఇచ్చారు.

## మెస్ చార్జీలు విడుదల చేయండి



మాట్లాడుతున్న పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర

**పుట్టపర్తి టౌన్:** రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీసీ వసతి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు 2,733 ఉన్నాయని తెలిపారు. ఇందులో దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 6 నెలలు పూర్తవుతున్నా ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయలేదన్నారు. ప్రతి నెలా అప్పు చేసి హాస్టళ్లను నిర్వహించడం వార్డెన్లకు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు దుప్పట్లు, మూడు జతల యూనిఫాం, పేట్లు, పెట్టెలు, బకెట్లు, మగ్గులు కూడా అందించాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.2,500 మెస్ చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కార్తీక్, విష్ణువర్దన్, మనోజ్ కుమార్, తేజ తదితరులు పాల్గొన్నారు

## పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నేతలు

**నల్లమాడ:** కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ డిమాండ్ చేశారు. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు కేటాయించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుకలు, కంకర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పేదలతో వ్యక్తిగత అర్జీలు ఇప్పించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. నాయకులు నాగేంద్ర, గంగాధర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

**రేపు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన**

**బత్తలపల్లి:** అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 18న రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీఐ నేతలు పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లి సీపీఐ కార్యాలయంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ధర్మవరం పట్టణ సీపీఐ సహాయ కార్యదర్శి రమణ విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, మండల కార్యదర్శి నాగభూషణ, అధ్యక్షులు పెద్దన్న, ఆదినారాయణ, వెంకటప్ప, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, దాసు, సన్నపెద్దన్న, చౌడయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్:** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఈనెల 18వ తేదీన ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. శనివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శులు లియాకత్ అలీ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ మధు నాయక్, జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర, సీపీఐ పట్టణ కార్యదర్శులు ఆదెప్ప, కొండయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

**ఎన్‌పీకుంట:** కందిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన కంది పంటను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 1,741 ఎకరాల్లో రైతులు కంది సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం కంది పంటకు ఆకుచుట్టు పురుగు, పూత పురుగు, కాయ తొలుచు పురుగు, రసంపీల్చే పరుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. త్వరితగతిన సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. ఆకు లేదా పూత చుట్టు పురుగు, కాయ తొలుచు పురుగు నివారణకు లాంబడా సైహలొత్రిన్ మందు ఒక లీటరు నీటికి ఒక మిల్లీలీటరు లేదా ఇండిక్సకార్బ్ ఒక లీటరు నీటిలో ఒక మిల్లీలీటరు కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే మచ్చల పరుగు లేదా రసం పీల్చే పరుగుల నివారణకు ఒక లీటరు నీటిలో నోవాల్యూరోన్ ఒక మిల్లీలీటరు లేదా 0.4 గ్రాముల ఏమమిక్టిన్ బెంజాయేట్ కలిపి పిచికారీ చేయించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

## 'అపార్' నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహ నాయుడు

**బత్తలపల్లి:** ఆధార్ తరహాలో అపార్ వివరాల నమోదు వేగవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహ నాయుడు విద్యాశాఖ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్‌లతో కలిసి మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను పొందుపర్చాలన్నారు. వారికి ఆధార్ తరహాలో అపార్ కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. అపార్ విధి విధానాలపై వివరించారు. వివరాలు సక్రమంగా ఉన్న విద్యార్థులకు సంబంధించి అపార్ జనరేషన్ వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు విద్యార్థులు బర్త్ సర్టిఫికెట్లు తీసుకుని వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారికి ఆయా శాఖల అధికారులు సహకరించాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా బర్త్ సర్టిఫికెట్లు తీసుకువచ్చి నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంఈఓ కళ్యాణి

**తనకల్లు:** బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఈఓ కళ్యాణి అన్నారు. శనివారం స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలలో సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో బాలలకు ప్రత్యేకంగా కొన్ని చట్టాలు, బాధ్యతలను కూడా రూపొందించారన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో యాక్ట్, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంపై వివరించారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల గురించి తెలిపారు. చెడు ఆలోచనలు, చెడు స్నేహాలను వదిలి గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషలాఫీసర్ అబీదాబీ, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సంస్థ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, కమ్యూనిటీ మొబలైజర్ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

**ధర్మవరం రూరల్:** విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిధిలోని గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలమైందన్నారు. ఈ దశలో విద్యార్థులు చదువుపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. అలా కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని సూచించారు. తల్లిదండ్రులు మీ మీద ఎంతో నమ్మకాన్ని పెట్టుకుంటారని.. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### మద్యం పట్టివేత

**చెన్నేకొత్తపల్లి:** కనగానపల్లి మండలం తూముచర్లలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. చంద్ర అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద అక్రమంగా ఉన్న 47 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఫరూఖాజం తెలిపారు. దాడుల్లో ఎస్ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నాయక్‌తో పాటు సిబ్బంది హరి, రంగనాయకులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం



తాడిమర్రి కేజీబీవీలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

**నల్లచెరువు:** విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి ప్రసాద్ నాయక్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పుస్తక పఠనం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పలువురు స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలన్నీ ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

**తాడిమర్రి:** ఉద్యమకారుల పోరాట ఫలితమే గ్రంథాలయాలు ఆవిర్భావం అని కేజీబీవీ ప్రిన్సిపాల్ వాణిశ్రీ పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి డీ.శీనా నాయక్ అధ్యక్షతన శనివారం కేజీబీవీలో గ్రంథాలయ ఉద్యకారులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంటక రమణయ్య, డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరు నాగభూషణం తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ వాణిశ్రీ మాట్లాడుతూ.. స్వతంత్య్ర పోరాటం జరుగుతున్న కాలంలో ప్రజలను చైతన్య పరచడానికి ఈ గ్రంథాలయ ఉద్యమం జరిగిందన్నారు. ఫలితంగా దేశంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేశారన్నారు. ఇంతటి పోరాటాలు చేసిన వారిని స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

**కనగానపల్లి:** గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్.ఆర్.రంగనాథన్, వెంకటరమణయ్య, హరిసర్వోత్తమరావు సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. శనివారం కనగానపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

**రామగిరి:** ప్రజలను విజ్ఞానవంతులను, చైతన్యవంతులను చేసేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి వెంకటేష్ పేర్కొన్నారు. రామగిరిలో శనివారం 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు.

### పాఠశాల తనిఖీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఆర్జేడీ వెంకట సన్యాసి శర్మ

**కదిరి అర్బన్:** మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీలో ఉన్న యూపీ పాఠశాలను శనివారం ఆర్జేడీ వెంకట సన్యాసి శర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. ఎలా చదువుతున్నారంటూ విద్యార్థులతో ముచ్చటించారు. తెలుగు సబ్జెక్టులో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

**అమడగూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అమడగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా వడ్డించలేదని.. సంబంధిత హెచ్‌ఎం కూడా పట్టించుకోలేదని పలువురు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు శనివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం అందించకపోతే బిల్లులు ఎలా మంజూరు చేస్తున్నారని ఉపాధ్యాయులపై మండిపడ్డారు. మెనూ ప్రకారమే భోజనం అందించాలని ఆదేశించారు. మెనూ పాటించకపోతే విద్యార్థులు ఫిర్యాదు చేయాలని సూచించారు. మెనూ పాటించకపోతే భోజన ఏజెన్సీ నిర్వాహకులను మార్పు చేస్తామని హెచ్చరించారు.

### రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

**ఓడీచెరువు:** మండలంలోని ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆధార్ మొబైల్ కాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 ,19 తేదీల్లో ఓడీచెరువు జెడ్పీ పాఠశాల, 20న వశిష్ట స్కూల్, 21న మిట్టపల్లి జెడ్పీ హైస్కూల్, 22న రైన్‌బో స్కూల్, 23న విజ్ఞాన్ స్కూల్, 25న గౌనిపల్లి జెడ్పీ హైస్కూల్, 26న శ్రీ విజ్ఞాన్, 27న కొంకడకమర్ల జెడ్పీ హైస్కూల్, 28న జీవనజ్యోతి, 29న జ్ఞానసాయి పాఠశాల, 30న అమ్మ విజ్ఞాన్‌లో ఆధార్ క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు.

### అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఆర్డీటీ ఆర్డీ శాంతమ్మ

**తలుపుల:** స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ మాట్లాడుతూ.. మహిళలు న్యాయపరమైన హక్కులు, విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో లాయర్లు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, ఏటీఎల్ లక్ష్మన్న, రెడ్స్ సంస్థ ఎల్లప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నీహారిక, దీప, లేబర్ డిపార్ట్‌మెంట్ సరస్వతి, మహిళా సేవా సమితి రాజేశ్వరి, లోక్‌అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

### సచివాలయం తనిఖీ

**ముదిగుబ్బ:** మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ విజయ్‌భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బయోమెట్రిక్ హాజరు, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, స్కూల్ టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల అపార్ నమోదు వేగవంతంగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండల రిసోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే చర్యలు

**బత్తలపల్లి:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లి బైపాస్‌లో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన రికార్డులు లేకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు. రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు. జిల్లా ఎస్పీ రత్న ఆదేశాలతో నిత్యం వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహన డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

### గొడవలకు దిగితే ఉపేక్షించం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ధర్మవరం రూరల్:** గ్రామాల్లో అనవసరంగా ఫ్యాక్షన్ గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం రాత్రి మండల పరిధిలోని సీతారాంపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

### 'సేద్యం' సినిమాకు ఉత్తమ జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న చంద్రకాంత్

**ధర్మవరం రూరల్:** ఇటీవల జీఎంఎస్ గ్యాలరీ ఫిల్మ్స్ బ్యానర్‌లో విడుదలైన సేద్యం సినిమాకు ఉత్తమ జాతీయ అవార్డు వచ్చిందని ధర్మవరం పట్టణానికి చెందిన చిత్ర దర్శకుడు చంద్రకాంత్ పసుపులేటి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా రాయలసీమలోని రైతుల ఆత్మహత్యలపై తెరికెక్కించిన రైతుల యదార్థ గాథే సేద్యం చిత్రమన్నారు. ఈ చిత్రానికి నిర్మాతలుగా గొరకాటి మహేష్‌రెడ్డి, గాజుల పద్మావతి వ్యవహరించారన్నారు. ఇటీవల చెన్నై నగరంలో జరిగిన ఎంఈఐ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులో సేద్యం సినిమాకు జాతీయ ఉత్తమ సినిమా అవార్డు రావడం తెలుగు జిల్లాలకు గర్వకారణమన్నారు. ఈ అవార్డును ఎంఈఐ సంస్థ చైర్మన్ చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు.